



క్యూలైన్లలో బారులు తీరిన జనం

అమ్మవారికి అక్షర పూజ



ప్రత్యేక అలంకరణలో సరస్వతి అమ్మవారు

ఆత్మకూరు/కొత్తపల్లి, ఫిబ్రవరి 2: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రాతఃకాల సమయంలోనే అమ్మవారికి చారుఘోషిణి జలాలచే అభిషేకం చేశారు. అనంతరం ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, పంచసూక్తాభిషేకాలను శాస్త్రోకంగా చేపట్టారు. తదుపరి సహస్రనామ కుంకుమార్చనలు, పుష్పార్చనలు, మహామంత్రపుష్పం, మహా నైవేద్యం, మహామంగళహారతులు వంటి తదితర పూజా కైంకర్యాలను జరిపారు. ఆలయ ముఖ మండపంలో పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ సామూహిక అక్షరాభ్యాసాలు, బీజాక్షర క్రతువులను నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర పరిధిలోని సప్త శివాలయాల్లో కొలువుదీరిన శివ లింగాలకు కూడా చారుఘోషినీ జలాలు, బిల్వపత్రాలు, పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను పురస్కరించుకుని అమ్మవారి గావించిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. క్షేత్రానికి విచ్చేసిన భక్తాదులందరికీ కాశిరెడ్డినాయన ఆశ్రమం, ఆర్యవైశ్య అన్నదాన సత్రం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



కొలను భారతి క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసం



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, అధికారులు



కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ



కుమార్తెకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దంపతులు

శ్రీశైల దేవస్థానం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు :

కొలనుభారతి క్షేత్ర ఆనవాయితీ ప్రకారం వసంత పంచమి వేడుకలను పురస్కరించుకుని శ్రీశైల దేవవస్థానం తరఫున సరస్వతీ అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకురాగా వాటిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, శ్రీశైలం దేవస్థానం సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, కొలనుభారతి పాలక మండలి చైర్మన్ వెంకటనాయుడు, ఈవో రామలింగారెడ్డి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకల్లో కాకనూరు శారద పీఠం పీఠాధిపతి యోగేంద్ర సరస్వతీ స్వామిజీ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, ఏఎస్పీ యుగంధర్, నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కుమారుడికి అక్షరాభ్యాసం చేయించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

కొలనుభారతి క్షేత్రంలో జరిగిన వసంత పంచమి వేడుకల్లో భాగంగా సరస్వతి అమ్మవారిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. ముందుగా తన కుమారుడు వీరనాగిరెడ్డికి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు.

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరాలయం



సప్త నదుల నుంచి బయల్పడిన సంగమేశ్వర ఆలయ గోపురం

కొత్తపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి సాగు, తాగునీటి అవసరాల కోసం అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో సంగమేశ్వర ఆలయ గోపురం మెలమెల్లగా బయల్పడుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 852.90 అడుగులుగా నమోదైంది. అలాగే శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా, 86.4752 టీఎంసీలుగా రికార్డయింది. దీంతో గత ఏడాది జూలై చివరి వారంలో వరద నీటిలో పూర్తిగా నీట మునిగిన సంగమేశ్వర ఆలయ గోపురం మెలమెల్లగా బయల్పడుతూ ఇలా భక్తులకు దర్శనమిస్తోంది. నీటి విడుదల కొనసాగితే శివరాత్రి పర్వదినానికి ఆలయం పూర్తిగా బయల్పడే అవకాశ ఉంది.

● సంగమేశ్వరుడిని దర్శించుకున్న ఆత్మకూరు డీఎస్పీ :

కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరంలోని ఎగువ ఉమామేశ్వరస్వామిని ఆత్మకూరు డీఎస్పీ రామాంజనాయక్ దంపతులు దర్శించుకున్నారు. వీరిచే ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ప్రత్యేక పూజాధిక్రతువులు చేయించారు.

ఈ నెల 6న కర్నూలుకు హైకోర్టు కమిటీ

మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు కమిటీ ఈ నెల 6వ తేదీన కర్నూలుకు వస్తున్నట్లు న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అవసరమైన స్థలంతో పాటు జడ్జిల నివాస స్థలాల పరిశీలనకు ఈ కమిటీ వస్తున్నట్లు మంత్రి తెలిపారు. కమిటీలో జడ్జిలు కూడా ఉండవచ్చన్నారు. న్యాయ రాజధాని పేరుతో ప్రజలను మభ్య పెట్టిన వైసీపీ ప్రభుత్వం తాత్సార వైఖరి వల్లే హైకోర్టు బెంచ్ ఆలస్యమైందని ఆరోపించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శరవేగంగా జరుగుతోందని తెలిపారు. దిన్నెదేవరపాడు ఈఆర్సీ భవన సముదాయంతోపాటు అధికారులు ఎంపిక చేసిన ప్రత్యామ్నాయ స్థలాలను బెంచ్ పరిశీలిస్తుందని, కమిటీ నిర్ణయం మేరకు హైకోర్టు బెంచ్ స్థలం నిర్ధారణ జరుగుతుందని మ్రంతి ఫరూక్ వెల్లడించారు.

నేడు ప్రజా వినతుల స్వీకరణ

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్‌గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఈ సోమవారం ఉదయం 9.30గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శనగ రైతుకు కష్టాలు



మల్లేవేములలో ధర లేక పొలంలో ఉంచిన శనగలు



మల్లేవేములలో శనగ పంట కోత కోస్తున్న మహిళా కూలీలు

- భారీగా తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు ధర లేక అప్పులపాలు
- కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం
- ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసే రైతులకు ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది మూడు సార్లు తుఫాన్ వచ్చి శనగ రైతులను నట్టేట ముంచింది. అధిక వర్షాలు, మొగిలితో రైతులు, కౌలు రైతులు ఎంతో నష్టపోయారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో అప్పుల నుంచి తేరుకోలేక పోతున్నారు. ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో శనగ పంటను సాగు చేస్తే ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో ఇలా..

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చాగలమర్రిలో 1,745 హెక్టార్లు, రుద్రవరంలో 102, ఉయ్యాలవాడలో 1,2392 హెక్టార్లు, దొర్నిపాడు 2,761 హెక్టార్లు, ఆళ్లగడ్డలో 970 హెక్టార్లు, గోస్పాడు 1,010 హెక్టార్లలో శనగ పంట సాగు చేశారు. డివిజన్‌లో రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ పంట ఏపుగా పెరిగి పచ్చగా ఉండటంతో అధిక లాభాలు వస్తాయని ఆశించిన రైతులను తుఫానులు దెబ్బతీసి అప్పులను మిగిల్చాయి.

● క్వింటం శనగలు రూ.5,400

పంట సాగుకు ముందు క్వింటం శనగల ధర రూ.7,400 ఉండగా.. ప్రస్తుతం రూ.5,400 ఉంది. గిట్టుబాటు ధర ఉందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. కోతల సమయంలో ధర లేక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు పొలాల్లోనే వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకుంటున్నారు. మరి కొందరు గోదాముల్లో నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తుఫాన్‌ల వల్ల పంట దిగుబడి తగ్గడమే కాకుండా శనగలు నల్లబారి నాసిరకంగా ఉండటంతో వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు.

● ధర పతనం..

డిసెంబరు నెలలో క్వింటం శనగలు రూ.5,700 వరకు వ్యాపారులు కొన్నారు. కొంతైనా పర్వాలేదని రైతులు భావించారు. పది రోజుల నుంచి కొత్త పంట ఇల్లు చేరుతుండటంతో గోదాముల్లో నిల్వ చేసిన పంట అమ్మేందుకు సిద్ధపడ్డారు. రూ.4,200 నుంచి రూ.4,500 మించి కొనడం లేదని, వ్యాపారులు కుమ్మక్కై ధర తగ్గించారని రైతులు కోరుతున్నారు. ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, సేద్యం ఖర్చులు రూ.27 వేలు నుంచి రూ.35 వేల పైనే వస్తోంది. 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఖర్చు పోను కొంత లాభం ఉంటుంది. ప్రస్తుతం 3 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. తాజా ధర ప్రకారం అమ్మితే పంట కోత ఖర్చులు కూడా చేతికి రావడం లేదని, అప్పులే మిగులుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ముందుగా కౌలు చెల్లించి పొలాలు తీసుకొని శనగ పంట సాగు చేశారు. ఈ ధర ప్రకారం పంట కోసం పెట్టిన పెట్టుబడులు సైతం దక్కలేదని శనగ రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కనీసం రూ.7,100 ధర పలికితే గిట్టుబాటు అవుతుంది. ధరలు లేక, దిగుబడి రాక రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



గొట్లూరులో శనగ పంటను మిషన్‌తో నూర్పిడి చేస్తున్న రైతు

● పదేళ్లుగా ధర లేని శనగ..

గత పదేళ్లుగా మార్కెట్‌లో శనగ పంట భారీగా పడిపోయింది. మూడేళ్ల క్రితం క్వింటం శనగలు రూ.7 వేలు కంటే ఎక్కువ ధరకు విక్రయించారు. ధర వస్తుందని కొందరు రైతులు శనగను కడప జిల్లాలోని గోదాముల్లో భద్రపరిచారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో గోదాముల్లోనే పంట దిగుబడి ఉంచారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు, కౌలు రైతుల పరిస్థితి దారుణంగా మారింది. ఈ ఏడాదైనా కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాల ద్వార శనగలను కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి




11 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. తుఫాన్‌తో పంట దిగుబడి తగ్గింది. పంట నల్లగా మారింది. శనగకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం. ప్రస్తుతం ఉన్న ధరతో విక్రయిస్తే గిట్టుబాటు కావడం లేదు.

- సుధాకర్‌రెడ్డి, రైతు, గొట్లూరు

నష్ట పోయాం

26 ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. ఎకరాకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. పంట సాగు నుంచి కోత వరకు మూడుసార్లు అకాల వర్షాలు కురిశాయి. దీంతో భారీగా నష్టపోయా.



- శివారెడ్డి, రైతు, గొట్లూరు

కష్టమే మిగిలింది



ఐదెకరాల్లో శనగ పంట సాగు చేశా. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో తీవ్రంగా నష్టపోయా. చేసిన అప్పులు కూడా తీర్చే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి.

- లక్ష్మీనారాయణరెడ్డి, రైతు, గొట్లూరు



ఐదేళ్లలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాలు

- చంద్రబాబు ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచారు
- దావోస్‌లో ఆయన కష్టం స్పష్టంగా కనిపించింది
- ఉదయం 6 నుంచి రాత్రి 11 వరకు సమావేశాలే
- జగన్ హయాంలో రాష్ట్రం విధ్వంసం: మంత్రి భరత్



కర్నూలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "వైసీపీ హయాంలో ఐదేళ్ల రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. వామ్మో.. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులా? అంటూ పారిపోయే పరిస్థితికి తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో పెట్టుబడిదారులకు మళ్లీ భరోసా కలిగింది. వివిధ సంస్థలు వస్తున్నాయి' అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉపాధి, ఉద్యోగాల కల్పన తథ్యమని చెప్పారు. "ఏడు నెలల్లో రూ.6.33 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వాటి ద్వారా 4.10 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయి. రాష్ట్రంలో రూ.65 వేల కోట్ల పెట్టుబడితో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్(సీబీజీ) యూనిట్ల ఏర్పాటుకు రియల్ ఇండస్ట్రీస్ ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా 2.55 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు రానున్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయయి. ఒకనాటి రాళ్లసీమ నేడు గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారబోతుంది" అని మంత్రి వివరించారు. ఐదేళ్లలో రాయలసీమ జిల్లాలకు మరిన్ని కంపెనీలు వస్తాయన్నారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది

వైసీపీ హయాంలో జగన్ సాగించిన అరాచకం, విధ్వంసం వల్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని మంత్రి భరత్ చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడడంతో వారిలో మళ్లీ భరోసా కలిగిందన్నారు. ఏపీ బ్రాండ్ ఇమేజీ పెరిగిందని, దావోస్ పర్యటనలో అది స్పష్టంగా కనపించిందని తెలిపారు. దావోస్‌లో ఎముకలు కొరికే చలి ఉన్నా.. సీఎం చంద్రబాబు సాధారణ దుస్తుల్లోనే గడపడం ఆయనకే సాధ్యమైందన్నారు. "అక్కడున్న ఐదు రోజులు ప్రతిక్షణం ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు సీఎం చంద్రబాబు కష్టపడ్డారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కంపెనీల ప్రతినిధులతో వందకు పైగా రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చలు, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను వివరించారు" అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు హైదరాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశారని, అక్కడ ఏర్పాటు చేసిన హైటెక్ సిటీ తరహాలో ప్రస్తుతం విశాఖలోని మధురవాడ వద్ద డేటా సిటీ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటికే గూగుల్‌తో ఒప్పందం కూడా చేసుకున్నామన్నారు. విశాఖ ఐటీ సిటీగా భారతపటంలో ప్రముఖ స్థానంలో నిలవబోతుందన్నారు. అమ్మకు, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి(జగన్) ఐదు కోట్ల ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ఘాటుగా స్పందించారు. "వైసీపీ నాయకులు నిరసనల పేరిట ప్రజల్లోకి వస్తున్నామని అంటున్నారు. ఏ మోహం పెట్టుకొని వస్తారు" అని మంత్రి భరత్ ప్రశ్నించారు.

వచ్చే ప్రాజెక్టులు ఇవీ..

- కర్నూలులో ఏపీ జెన్కో, ఎన్‌హెచ్‌టీసీ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి.
- అనంతపురం, కడపల్లో ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ-1 రూ.1,728 కోట్లతో ప్రాజెక్టు పెట్టనుంది.
- అనంతపురం జిల్లాలో టాటా పవర్ రూ.2 వేల కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేయనుంది.
- కడప, నంద్యాల జిల్లాల్లో ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ-2 రూ.1,728 కోట్లతో ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది.
- ఎకోరెడ్ ఎనర్జీ ఇండియా కర్నూలు జిల్లాలో రూ.4,435 కోట్లతో, కర్నూలు, నంద్యాల జిల్లాలో రూ.3,142 కోట్లు, అనంతపురం, కడప జిల్లాల్లో రెండు యూనిట్లలో రూ.794 కోట్లు, కడప, నంద్యాల జిల్లాల్లో 'క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ' హైబ్రిడ్-3 రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలో టాటా పవర్ ఎనర్జీ కర్నూలు జిల్లాలో రూ.2 వేల కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేయనుంది.
- గ్రీన్‌కో రూ.16,500 కోట్లతో మూడు ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది.

నేడు ఇంటర్ పర్యావరణ విద్య పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్యావరణం విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలోని 162 కళాశాలల నుంచి 23,262 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షకు హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గతంలో ఈ పరీక్ష రాయని ఇంటర్ సెకండియర్ విద్యార్థులు ఉంటే వారు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ

- కర్నూలు డీసీసీ అధ్యక్షుడు మురళీ కృష్ణ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పీ. మురళీకృష్ణ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-26 పెట్టుబడిదారులను అందలం ఎక్కించేలా ఉందన్నారు. ఇది రైతు వ్యతిరేక బడ్జెట్ అని, మద్దతు ధరలు రుణమాఫీ ప్రస్తావన లేదని, పంట బీమాకు నిధులలు కేటాయింపు లేకపోవడం రైతులను నిరాశ పరిచిందని అన్నారు. దళితులు, మైనార్టీలు, బీసీలకు విద్య, ఆరోగ్యంపై ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. అన్ని రంగాలకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటిం చిన, ఎరువుల సబ్సిడీకి నిధులు కేటాయింపులేక పోవడం దారుణమన్నారు.

గోశాల అభివృద్ధికి కృషి

- దాతల సత్కార సభలో మంత్రి టీజీ భరత్



గోవుకు ఆహారం తినిపిస్తున్న రాష్ట్ర మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గోశాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగర శివారు డోన్ రోడ్డులోని గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాయత్రి గోశాలలో ఆవుల సంఖ్య ఎవెయ్యి దాటిన సందర్భంగా గోశాల దాతలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. గోమాతలకు ఆహారం తినిపించి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గోవులకు సేవ చేస్తే శుభం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ గోసేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు. గోవులకు సంతృప్తిగా గ్రాసం అందించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అవసరమైతే గోశాలలో గుడి కట్టించేందుకు ఆలోచించాలని ఇదివరకే నిర్వాహకులకు చెప్పినట్లు గుర్తు చేశారు. గోశాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గోశాల అభివృద్ధికి సహకరించిన దాతలను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, గోశాల అధ్యక్షుడు జగదీష్‌గుప్త, ఇల్లూరు లక్ష్మయ్య, విజయకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

- డివైడర్ పైకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు, ప్రయాణికులు క్షేమం



డివైడర్ పైకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు



మృతి చెందిన డ్రైవర్ ఉసేన్ సాబ్

ఆలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో స్టీరింగ్‌పైనే స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బస్సులో ఉన్న ప్రయాణికులు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు. కేఏ384759 నెంబరు గల మీనాక్షి ట్రావెల్స్ బస్సు ఆదివారం ఆదోని నుంచి బళ్లారికి వెళ్తోంది. ఆలూరు పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ ఉషేన్‌సాబ్ (64)కు గుండెపోటు వచ్చింది. దీంతో బస్సు స్టీరింగ్ అదుపు తప్పడంతో ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొంది. పెద్ద శబ్దం రావడం అందులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు ఆగిపోగానే బయటకు పరుగులు తీశారు. డ్రైవర్ స్పృహ కోల్పోవడంతో హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. డ్రైవర్ కర్ణాటకకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రమాద ఘటనను ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు. ప్రయాణికులకు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రెండో రోజు కుంభాభిషేకం

ఘనంగా కొనసాగుతున్న ఉరుకుంద ఈరన్న స్వామి వేడుకలు



నందికోల ఉత్సవం



ఆకట్టుకున్న మహిళల కోలాటాలు



కలశాల ఉత్సవం

కౌతాళం ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో కుంభాభిషేక వేడుకలు రెండో రోజు ఆదివారం వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా హోమాలు, కలశాల అభిషేకాలు చేపట్టారు. ముందుగా యాగశాలలో సుదర్శన, మృత్యుంజయ, చండీ యాగాలు నిర్వహించారు. వాస్తు, బలిదాన పూజ, సూర్య నమస్కార సూర్యోదయాన నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులు, కలశాలతో ధాన్య, జలాధివాస క్రతువులు చేశారు. యాగశాలలో రుద్వేగ, యజుర్వేద, అధర్వణ వేద పఠనంతో శాస్త్రోక్తంగా దేవతా మూర్తులు, కలశాలకు పంచామృతాభిషేకం, మంగళ హారతులు చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా దేవాలయం నుంచి ఉరుకుంద గ్రామం వరకు మహిళలు కలశాలు చేతపట్టి కోలాటలతో ఉత్సవాలు ప్రారంభించారు. వీరభద్ర స్వామి వేషధారణలో చేపట్టిన సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. నంది కోలసేవలు, కేరళ మంగళవాయిద్యాలు భక్తులకు కనువిందు చేశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, కర్నూలు డీసీ గురుప్రసాద్, ఏసీలు పాండురంగారెడ్డి, గంజి మల్లికార్జున ప్రసాద్ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు




బాలికల విభాగంలో విజేతలు ఏపీ, నాగాలాండ్ జట్లు

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్న జాతీయ జూనియర్ సెపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జాతీయ చాంపియన్‌షిప్ డబుల్స్ విభాగం బాలుర విభాగంలో హర్యానా, తెలంగాణ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో హర్యానా జట్టు తెలంగాణ జట్టుపై 15-13, 15-12 స్కోర్ తేడాతో ఘన విజయం సాధించింది. బాలికల డబుల్స్ విభాగంలో నాగలాండ్, ఆంధ్రప్రదేశ్ జట్లు పోటీ పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు నాగాలాండ్ పై 15-9, 15-5 స్కోరు తేడాతో విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. క్వాడ్ విభాగం బాలుర పోటీలో బీహార్ జట్టు మణిపూర్ జట్టు పై 15-9, 15-13 స్కోరు తేడాతో విజయం సాధించింది. బాలికల పోటీలో మణిపూర్ జట్టు హర్యానాజట్టుపై 15-9, 17-15 స్కోరు తేడాతో విజయం సాధించింది. విజేతలకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, రామకృష్ణా విద్యా సంస్థల చైర్మన్ జి.రామకృష్ణా రెడ్డి, డా. జి. రవికృష్ణ, డా.మధుసూదన్‌రావు, ఏపీ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవర్ ఆర్టిస్ట్ బుక్‌లో కోటేష్ చిత్రాలు

- అంతర్జాతీయ చిత్ర కళామిత్ర అవార్డు







నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్‌కు అవర్ ఆర్టిస్ట్ బుక్‌లో రెండు పేజీలు కేటాయించి, ఆయన వేసిన ఆరు చిత్రాలను ప్రచురించారు. చిత్రకళలో ఆయన చేస్తున్న సేవలకు "చిత్రకళా మిత్ర" అవార్డును ప్రదానం చేశారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలోని కోనసీమ చిత్రకళ పరిషత్ వారు 35వ చిత్రకళ బ్రహ్మోత్సవ వేడుకలు జనవరి 19న అమలాపురంలోని సత్యసాయి కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన, "అవర్ ఆర్టిస్ట్" అనే బుక్‌ను ఆవిష్కరించారు. ప్రసిద్ధ చిత్రకారుడు, పరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామ స్వామి 215 మంది కళాకారులను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కోటేశ్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ పుస్తకం ద్వారా ప్రసిద్ధ చిత్రకారులు బాపు, వడ్డాది పాపయ్య, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో ప్రముఖ చిత్రకారులను తెలియపరిచారు. కోటేష్ వేసిన గణేశుడు, రాధాకృష్ణ, బుద్ధుడు, పూసలమ్మే అమ్మాయి చిత్రాలు ఈ పుస్తకంలో చోటు సంపాదించుకున్నాయి.

ఉపాధిలో అక్రమాలకు చెక్

ఉమ్మడి జిల్లాలో 20వేల శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు కసరత్తు



ఉపాధి పనులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు, వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పించి వలసలను నివారించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం క్రమేణా అక్రమార్కులకు జేబులు నింపే పథకంగా మారింది.

దొంగ మస్టర్లతో స్వాహా..

నేతలు, వారి అనుచరులు దొంగమస్టర్లను రికార్డుల్లో నమోదు చేయించి పెద్ద ఎత్తున కూలీల సొమ్మును స్వాహా చేస్తున్నట్లు ఫిర్యాదులు వెలువెత్తుతు న్నాయి. పాత పనులకే మెరుగులు దిద్ది పెద్ద ఎత్తున నిధులను దుర్వినియోగం చేస్తున్నట్లు ఆ పథకం అమలుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం అక్రమాల నివారణ కోసం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టింది.

ఉపాధి హామీ పథకాన్ని గాడిన పెట్టేందుకు కర్నూలు జిల్లాలో 10వేల శ్రమశక్తి సంఘాలు, నంద్యాల జిల్లాలో మరో 10వేల శ్రమశక్తి సంఘాలు, మొత్తం 20వేల శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేయబోతున్నట్లు నీటి యాజమన్య సంస్థ పీడీ వెంకటనారాయణ ఇటీవల తెలిపారు. ఒక్కో సంఘంలో 20 నుంచి 50 మంది సభ్యులు ఉంటారనీ, వీరు ప్రతిరోజు ఎంత మంది కూలీలు హాజరవుతారో పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తమకు నివేదికలు అందజేస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఏటా రూ.600కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు.

ఉపయోగం లేదని రైతుల ఆందోళన

కర్నూలు జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలను వలస వెళ్లకుండా నిరోధించడంలో ఉపాధి హామీ పథకం పెద్దగా ఉపయోగపడడం లేదని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రమశక్తి సంఘాల ద్వారా ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగం అడ్డుకట్ట వేసి రైతులకు, వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున ఆదుకున్నారు. వైసీపీ ప్రభుత్వం శ్రమశక్తి సంఘాలను రద్దు చేయడంతో పథకం పక్కదారి పట్టింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని దారిలో పెట్టేందుకు శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వైభవంగా వసంత పంచమి

● సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు ● చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన తల్లిదండ్రులు ● భక్తులతో కిక్కిరిసిన కొలను భారతి క్షేత్రం


జూపాడుబంగ్లాలో అక్షరాభ్యాసం


పగిడ్యాల: నెహ్రూనగర్ గ్రామంలో..



కొలను భారతి క్షేత్రంలో ఎమ్మెల్యే జయసూర్యకు ప్రసాదం అందజేస్తున్న శ్రీశైల దేవస్థానం అర్చకుడు, కాశిరెడ్డినాయన ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



జూపాడుబంగ్లా, ఆత్మకూరులో ప్రత్యేక అలంకరణలో సరస్వతి అమ్మవారు

ఆత్మకూరు/కొత్తపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కొలనుభారతి క్షేత్రంలో జరిగిన వసంత పంచమి వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అయితే అధికార యంత్రాంగం భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా తగిన ఏర్పాట్లను సిద్ధం చేశారు. క్యూలైన్లు, సామూహిక అక్షరాభాస్య కేంద్రం, తాగునీరు, వైద్యం, మరుగుదొడ్లు, దుస్తుల మార్పిడి గదులు తదితర అన్ని రకాల సదుపాయాలను సమకూర్చారు. క్యూలైన్ల వద్ద పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. కాగా అటవీమార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రైవేట్ వాహనా లన్నింటిని శివపురం చెంచుగూడేం వద్దే నిలిపివేశారు. అదే విధంగా అటవీ మార్గంలో దుమ్ముతో ఏర్పడకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు నింతరం కొనసాగాయి.

అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు

కొలనుభారతి క్షేత్రంలో జరిగిన వసంత పంచమి వేడుకల్లో భాగంగా సరస్వతి అమ్మవారిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. ముందుగా తన కుమారుడు వీరనాగిరెడ్డికి అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ.. కొలనుభారతి క్షేత్రాభివృద్ధికి నంద్యాల ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి తాను కూడా కృషి చేస్తానని తెలిపారు. గతంలో తాను పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు క్షేత్రాభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ ప్రభుత్వం మారడంతో అవన్నీ మరుగున పడ్డాయన్నారు. కాకనూరు శారదపీఠం పీఠాధిపతి యోగేంద్ర సరస్వతీ స్వామిజీ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, ఏఎస్పీ యుగంధర్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, తహసీల్దార్ ఉమారాణి, ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్, కొత్తపల్లి, వెలుగోడు ఎస్సైలు కేశవ, విష్ణునారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే జయసూర్య

రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. ప్రత్యేకించి సీఎం చంద్రబాబు రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇందులో భాగంగా కొలనుభారతి, సంగమేశ్వరం క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటానని అన్నారు. వచ్చే వసంత పంచమి వేడుకల్లోగా క్షేత్రానికి త్రీఫేజ్ కరెంట్ సప్లై చేసి ఇతర సమస్యలను పరిష్కారిస్తామన్నారు. సీజీఎఫ్ కింద రూ.1.20కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే జీర్ణోద్ధరణ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నారపురెడ్డి, కొలనుభారతి పాలక మండలి మాజీ చైర్మన్ లింగస్వామిగౌడ్, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ ఉన్నారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు పట్టణంలోని అంబాభవానీ మాత ఆలయంలో వెలసిన జ్ఞాన సరస్వతి అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వసంతపంచమి వేడుకలను వైభవంగా నిర్వహి ంచారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో వెలసిన దేవతా మూర్తులకు, జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, విద్యార్థులతో పుస్తక పూజ తదితర పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో జ్ఞానసరస్వతి అమ్మవారికి రాత్రి తొట్లోత్సవ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి చిన్నారులకు దంపతుల ఆధ్వర్యంలో అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు.

జూపాడుబంగ్లా: వసంతపంచమి పురష్కరించుకుని జూపాడు బంగ్లాలోని సరస్వతి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిం చారు. పురోహితుల ఆధ్వర్యంలో ఉదయం హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంక రించి పలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పగిడ్యాల: వసంత పంచమి సందర్భంగా మండలంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సరస్వతీదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహదాత వై. శ్రీనయ్య ఆధ్వర్యంలో ఉదయం గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల్, జయరాముడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీవీ మెకానిక్‌లకు సహకారం: మంత్రి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): టీవీ మెకానిక్‌లకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం టీవీ మెకానిక్ అసోసియేషన్ సమావేశం అసోసియేష్ అధ్యక్షుడు కన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. పెరుగుతున్న సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుంటూ టీవీ మెకానిక్‌లు అభివృద్ధి చెందాలంటూ వారికి సబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ రాష్ట్ర టీవీ యూనియన్ ఏయూటీయూ లోగోను ఆవిష్కరించారు. నూతన సభ్యులతో కళారాధన అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆర్‌కే రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయపాల్, శివయాదవ్, కోశాధికారి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన బీజేపీ నాయకులు


ఎమ్మెల్యే బుడ్డాను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని ఆదివారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబాన మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కూటమి ప్రభుత్వ పాలనపై వారు సమీక్షించారు. కాగా నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీజేపీకి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే బుడ్డాను కోరినట్లు తెలిసింది. ఇందుకు ఆయన స్పందిస్తూ నామినేటెడ్ పోస్టుల భర్తీలో తప్పకుండా బీజేపీ, జనసేన పార్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు ఎవరికి అర్హతలు ఉన్నాయని ఆ జాబితాను సిద్ధం చేసుకోవాలని వారికి సూచించారు.

'క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు'


బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని, క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిపిల్ మున్నా, గిరిజన ఉపాధ్యాయ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జవహర్‌నాయక్ అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు ఆత్మకూరు తాలూకా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీల్లో నంద్యాల నందిపైప్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. రెండో స్థానంలో జూపాడు బంగ్లా జట్టు, మూడో స్థానంలో కర్నూలు, నంద్యాల జట్లు సంయుక్త విజేతలుగా నిలిచారు. నాలుగో స్థానంలో కోటకొండ జట్టు నిలిచింది. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు.అధ్యాపకులు బ్రహ్మానందం, అబ్దుల్ జబ్బార్, రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెలుగోడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వెలుగోడు, బోయరేవుల గ్రామాల మధ్య ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనం, జీపు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. బోయరేవుల గ్రామానికి చెందిన మల్లికార్జున వెలుగోడులో తన పని ముగించుకొని స్వగ్రామమైన బోయరేవుల గ్రామానికి బయలుదేరారు. అయితే పట్టణ శివారులో బైకు, నంద్యాల నుంచి వస్తున్న జీపు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయనను 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు.

మ్యాట్లు ఎక్కడ?

● ఇండోర్ స్టేడియంలో ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు


మ్యాట్లు లేకపోవడంతో కనిపిస్తున్న సిమెంట్ ఫ్లోరింగ్


నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియం

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. క్రీడలను అభివృద్ధి చేయాల్సిన అధికారే నిర్లక్ష్యం చేస్తూ క్రీడా శిక్షణకు ఆటంకం కలిగిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. జిల్లాలో అన్ని క్రీడల అభివృద్ధికి సమన్వయం చేసుకుంటూ క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా ప్రోత్సహించాల్సిన డీఎస్‌డీవో ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2023లో ఇండోర్ స్టేడియం, ఔట్ డోర్ స్టేడియానికి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)నుంచి హాకీ కిట్లు, మ్యాట్లు పంపిణీ చేశారు. అయితే మ్యాట్లు కొన్ని రోజులకు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసి అందులో ఫెన్సింగ్ క్రీడను ప్రాక్టీస్ చేస్తున్నారు. అలాగే హాకీ కిట్లు వాడుకలోకి తెచ్చారు. ఇండోర్ స్టేడియంలోని మ్యాట్లను బయట టోర్నమెంట్లకు పంపిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నంద్యాల నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలో ఓ ప్రైవేట్ టోర్నమెంట్‌కు మ్యాట్లు పంపి మూడు నెలలవుతున్నా ఇంతవరకు నంద్యాలకు ఆ మ్యాట్లు తిరిగిరాలేదు. ఈ విషయమై ఫెన్సింగ్ క్రీడాకారుల తల్లిదండ్రులు పలుమార్లు డీఎస్‌డీవో దృష్టికి తెచ్చినా తెప్పిస్తున్నామంటూ దాటవేస్తున్నారేకానీ మ్యాట్లు మాత్రం నంద్యాలకు చేరుకోలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం నంద్యాలకు శాప్ చైర్మన్ రవినాయుడు డీఎస్ఏను పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా క్రీడాకారుల తల్లిదండ్రులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మ్యాట్లు లేక క్రీడాకారులకు దెబ్బలు తగిలి ఆస్పత్రుల పాలవుతున్నారని చైర్మన్‌కు మొరపెట్టుకున్నారు. మ్యాట్లను ప్రైవేట్ టోర్నమెంట్లకు ఇచ్చి వచ్చిన సొమ్మును ఏమి చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. డీఎస్‌డీవో రాజ్‌ను వివరణ కోరగా ఆత్మకూరు క్రీడా వికాస్ కేంద్రంలో ఉన్నాయని, త్వరలో తెప్పిస్తామని చెప్పారు. ప్రైవేటు, అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నీలకు అద్దెకు ఇస్తున్న విషయం వాస్తమేనన్నారు.

స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఆదివారం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం సందర్భంగా దేవస్థానం తరుపున ఈ సేవను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. ఆ తర్వాత మహా గణపతి పూజ అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీ వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలను నిర్వహించారు.

హామీలు నెరవేర్చాలి: సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్

గోస్పాడు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్న పేదలకు సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. హామీలను అమలు చేయకపోతే పోరాటాలు చేస్తామన్నారు. సహాయ కార్యదర్శి జిలానీ బాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

నందికొట్కూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో ఆవోపా ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డా.అల్వాల గురువయ్య, డా.అల్వాల నవీన్, డా.శ్వేత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరబొమ్మ నాగ సత్యనారాయణ, ఆర్టీసీ డిపో మేనేజర్ నాగరాజు, ఆవోపా సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అలవాల రామ్మూర్తి, కల్కి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శంకరమల్లయ్య కొట్టాల గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన దేవాలయంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. పురోహితులు ఉదయం నుంచి గణపతిపూజ, ప్రభాతపూజ, అభిషేకాలు, కర్పూర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, సహకార సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.

'మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి'

నందికొట్కూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గీత కులాల మద్యం దుకాణాలకు అర్హులైన గౌడ, ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ.రామాంజనేయులు సూచించారు. ఆదివారం గీత కులాల మద్యం దుకాణాలు కేటాయింపు, దరఖాస్తులు చేసుకునే విధానం మీద గీత కులాల వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాల్టీ, జూపాడుబంగ్లా, పగిడ్యాల మండలాలల్లో ఈడిగ, గౌడ కులస్థులకు మద్యం దుఖాణాలు కేటాయించినట్లు తెలిపారు. ఈ రెండు కులస్తులు వారికి కేటాయించిన దకాణాలకు ఒక్కో అప్లికేషన్ ఫీజు రూ.2 లక్షలు, లైసెన్సు ఫీజులో సగం మాత్రమే చెల్లించేలా వెసలుబాటు కల్పించామన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 5 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల ధృవీకరణ పత్రం పొందడంలో ఏదైనా సమస్యలున్నా, దరఖాస్తులు చేయడంలో ఏదైనా సమస్యలు ఉన్నా నంద్యాల ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారి రవికుమార్ 8008828467, నందికొట్కూరు సీఐ రామాంజనేయులు ఫోన్ నెంబర్ 9440902576ను సంప్రదించాలని సూచించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలను అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్‌లు సూచించారు. ఆదివారం గీత కులాలతో వారితో సమావేశం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు అర్బన్, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు ఒక్కో దుకాణం చొప్పున మొత్తం మూడు దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. ఆత్మకూరు, కొత్తపల్లి గౌడ కులానికి కాగా, పాములపాడు ఈడిగ కులానికి కేటాయించినట్లు వివరించారు. ఈనెల 5న సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. 6న దరఖాస్తుల పరిశీలన, 7న లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల నాన్ రీఫండ బుల్ అమౌంట్‌ను ఆన్‌లైన్ చలానా గానీ, డీడీ రూపంలో గానీ చెల్లిం చాల్సి ఉంటుందన్నారు. ఒక్కొక్కరికి ఒక్క దుకాణం మాత్రమే కేటాయి స్తారని తెలిపారు. రెండేళ్ల కాలవ్యవధిలో తొలి ఏడాది రూ.18.33 లక్షలు, రెండో ఏడాది రూ.30.25లక్షల వార్షిక ఫీజు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440902585 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'బీజేపీతోనే దేశ ప్రగతి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబాన ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలో దేశంలో అన్ని రంగాల్లో దూసుకుపోతుందని అన్నారు. అనేక ప్రజాహిత కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. అదేక్రమంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో జిల్లాలో బీజేపీ పటిష్టతకు ప్రతి కార్యకర్తగా బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

నెలాఖరు వరకు 'సెక్షన్ 30 పోలీస్ యాక్ట్' అమలు

● ఎస్డీపీవో జావలి ఆల్ఫోన్స్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్‌లో 30-పోలీస్ యాక్ట్ అమలు పరచినట్లు నంద్యాల ఎస్డీపీవో మందా జావలి ఆల్ఫోన్స్ ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ యాక్ట్ ఈ నెల 28వ తేదీ వరకు అమలులో ఉంటుందని చెప్పారు. నంద్యాల సబ్ డివిజన్‌లోని వివిధ ప్రజా స్థలాలలో కొన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ఇతర సంస్థలు సభలు నిర్వహించనున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి సభలు, సమావేశాల వల్ల ప్రజా జీవితానికి ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. ప్రజల ఆస్తులకు నష్టం సంభవించే అవకాశం ఉన్నందున 30-పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు నిర్వహించాలనుకున్నా, పబ్లిక్ స్థలాల్లో సభలు నిర్వహిం చాలనుకుంటే అలాంటివారు సమావేశం నిర్వహించే తేదీ, సమయం, ఎక్కడ నిర్వహిస్తున్నామన్న వివరాలతో ముందుగానే సంబంధిత పోలీస్ అధికారులకు దరఖాస్తు చేసుకొని ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. అలా అనుమతి పొందిన షరతులను నిర్వాహ కులు విధిగా పాటించాల్సి ఉంటుందని ఎస్డీపీవో స్పష్టం చేశారు.

'సత్ప్రవర్తనతో మెలగాలి'

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులు నేరప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసు అధికారులు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వారు జీవి స్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం: సీపీఎం


నంద్యాలలో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు


ఆత్మకూరులో..

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఆదివారం 2025-26 కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌ల కోసం ప్రవేశపెట్టినట్లు ఉందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోటమద్దులు, వెంకటలింగం, సుబ్బారావు, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం చేశారని సీపీఎం నాయకుడు రణధీర్ ఆరోపించారు. ఆదివారం కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను పక్కనబెట్టి ఏపీకి అన్యాయం చేశారని ఆరోపించారు. నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

● రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డికి బొకే అందజేస్తున్న సీడ్స్ శాఖ అధికారులు

డోన్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణం సమీపంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ధర్మవరం సుబ్బారెడ్డిని రాష్ట్రంలోని పలు ప్రాంతాల సీడ్స్ అధికారులు సూపర్‌వైజర్లు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

'ధర్మప్రచారం అందరి బాధ్యత'

చాగలమర్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ధర్మప్రచారం అందరి బాధ్యతని శివరామానంద ఆశ్రమం పీఠాధిపతి అభినవ శంకరానంద స్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి పాత శివాలయంలో భజగోవిందం ప్రవచన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులతో కలిసి గోవిందనామ పారాయణం చేశారు. అందరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలని అన్నారు. ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలో చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడుభాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ప్రిన్సిపాల్, నాయకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆదివారం సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విగ్రహదాత బీసీ విజయకుమార్, టీడీపీ నాయకులు రాజా నారాయణమూర్తి, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ప్యాపిలి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబు పట్టణాల్లో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు వెంకటేసు, శ్రీనివాసులు, నాగన్న, పెద్దన్న, గోవిందు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని కొలుములపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద టీడీపీ మండల సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, పొలాలకు వెళ్లే రోడ్లు వేయించేందుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తుందన్నారు. కొంత మంది మహిళలు తమ పొలాలకు రోడ్లు వేయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, టీడీపీ నాయకులు బీమేశ్వరరెడ్డి, జావాజీ వెంకటేశ్వర్లు, నాగరాజు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ

రుద్రవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి సునీత ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. 2న నంద్యాల లోని ఎస్‌పీజీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వ్యాస రచన పోటీలు నిర్వహించారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మొదటి స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థిని సునీతను ఆయన అభినందించారు.



విద్యార్థినికి మెమెంటో ఇస్తున్న ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు

ఘనంగా లక్ష కుంకుమార్చన



పూజలో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మాఘమాసం, వసంత పంచమి సందర్భంగా ఆదివారం వాసవీ మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమతో అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా వసంత పంచమి వేడుకలను నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీసభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నమో.. నారసింహా

- గోవిందనామ స్మరణతో మార్మోగిన ఆళ్లగడ్డ
- ఉత్సాహంగా కొనసాగుతున్న శ్రీవారి పార్వేట

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేట పల్లకి ఆదివారం ఆళ్లగడ్డకు చేరుకోవడంతో ప్రజలు నీరాజనం పట్టారు. భక్తులు వందలాదిగా పల్లకికి ఎదురెళ్లి స్వామివారిని ఆహ్వానించారు. దీంతో ఆళ్లగడ్డ పట్టణంలో గోవిందనామ స్మరణ మారుమ్రోగింది. స్వామిరాక సందర్భంగా పట్టణంలో ఆనవాయితీగా వస్తున్న తెలుపులను మహిళలు రంగులు, రంగవల్లులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పల్లకిలో కొలువైన జ్వాలా, ప్రహ్లాదవరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, పట్టణ సీఐ చిరంజీవి, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్



ఆళ్లగడ్డకు చేరుకుంటున్న అహోబిలేశుడి పార్వేట పల్లకి

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో డీఎస్పీ శ్రీనివాసులు సహకారంతో ఏర్పాటు చేసిన డోన్ పోలీస్ క్రికెట్ నెట్, కబడ్డీ, షటిల్ బాల్ బాడ్మింటన్ క్రీడా మైదానాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే యువతీ యువకులు ఆర్థిక పరిస్థితి బాగాలేక ప్రతిభ ఉన్నప్పుడు కూడా క్రీడల్లో పాల్గొనలేకపోతున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి యువత అధికంగా మొబైల్ ఫోన్లు, గేమ్స్‌లలో మునిగి తేలుతున్నారని, వారిని క్రీడామైదానాల్లోకి తీసుకువచ్చి ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టా మన్నారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, టౌన్ ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, మాజీ వైస్ చైర్మన్ కేశన్నగౌడు, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

టిడ్కో ఇళ్లను కేటాయించాలి

● ఎమ్మెల్యే కోట్లను కలిసిన దర్జీలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మాణాలు పూర్తి అయిన టిడ్కో ఇళ్లను అర్హులైన దర్జీలకు కేటాయించాలని డోన్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఆలా మల్లికార్జున, రాఘవేంద్ర, కార్యదర్శి, సహాయ కార్యదర్శులు ఇస్మాయిల్ రెహిమాన్, కోశాధికారి లల్లిరావులు డిమాండ్ చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కోట్లను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన టైలర్లకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

డీవీఎన్‌సీ మెంబరు బాలనాగన్నకు సన్మానం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండారెడ్డి గ్రంథాలయం ఆవరణంలోని కమిటీ హాల్‌లో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డీవీఎంసీ మెంబరు బోధనం బాలనాగన్నను సత్కరించారు. బీజేపీ నాయకుడు అప్పపోగుల వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ భీమునిపాడుకు చెందిన బోధనం బాలనాగన్నకు డీవీఎంసీ పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబులేసు, సుధాకర్, లింగన్న, వడ్డెసుబ్బరాయుడు, ఓబయ్య, గంగన్న, కత్తి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 2 ఆంధ్రజ్యోతి): వడ్డెర సొసైటీలకు రుణ సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని వడ్డెరసంఘం కన్వీనర్ శిల్పి సుబ్బరాయుడు కోరారు. ఆదివారం పట్టణంలో వడ్డెర హక్కుల డిమాండ్ల కరపత్రాన్ని వడ్డెరసంఘం నాయకులు విడుదల చేశారు. శిల్పిసుబ్బ రాయుడు మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర ఫెడరేషన్‌కు రూ.1000కోట్లు నిధులు విడుదల చేయాల న్నారు. త్వరలో నంద్యాలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయ న తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గిడ్డయ్య, మధుశేఖర్, మధు, మద్దిలేటి, వీరన్న, రాజు పాల్గొన్నారు.

వడ్ల ట్రాక్టర్ బోల్తా

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వడ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటన పట్టణంలోని బనగానపల్లె రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. నడ్డిరోడ్డుపై వడ్ల మూటలు కింద పడ్డాయి. ట్రాక్టరులో ఉన్నవారు ప్రమాదం నుంచి తప్పించుకు న్నారు.

5లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే విధానంపై ఆళ్లగడ్డ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ రవి కుమార్ ఆదివారం అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈడిగ కులస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. సాధారణ మద్యం దుకాణాలకంటే యాభై శాతం లైసెన్సు ఫీజు మాత్రమే వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో టెండరు దాఖలు, జత చేయాల్సిన పత్రాలు, కుల ధృవీకరణపత్రం పొందాల్సిన విధానంపై సీఐ వారికి అవగాహన కల్పించారు. ఈ నెల 5వ తేదీ వరకు ఆళ్లగడ్డ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దంపతులపై దాడి : ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు గ్రామంలో పెద్ద ఈశ్వరయ్య దంపతులపై దాడికి పాల్పడిన ముగ్గురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. కోటపాడుకు చెందిన పెద్ద ఈశ్వరయ్య, చిన్న ఈశ్వరయ్య కుటుంబాల మధ్య పొలం గట్టు తగాదా నెలకొంది. దాంతో పెద్ద ఈశ్వరయ్యపై చిన్న ఈశ్వరయ్య, వెంకటలక్ష్మమ్మ, మహేష్ ముగ్గురు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ


రుద్రవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. నాగులవరం గ్రామంలో నాగారపమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీకి పాల్పడి నట్లు ఆదివారం గ్రామస్థులు తెలిపారు. ఆదివారం యథావిధిగా పూజలు చేసేందుకు పూజారులు వచ్చారు. ఆలయంలో హుం డీ కనిపించకపోవడంతో గ్రామ పెద్దలకు తెలిపారు. చోరీకి గురైన హుండీ గ్రామ సమీపంలోని పొలాల్లో పడేశారు. పొలాల్లో హుండీని గుర్తించిన గ్రామస్థులు దేవాలయానికి తీసుకవచ్చారు.

లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- సహాయకుడి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ సమీపంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రహదారి ప్రమాదం జరిగింది. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరుణాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందువైపు వెళ్తున్న ఓ లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ రహదారిపై బోల్తాపడగా ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ట్రావెల్స్ బస్సులో సహాయకుడిగా పని చేస్తున్న ముఖేష్(24) మృతిచెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఎన్‌సీసీ పరీక్షలు



బనగానపల్లెలో పరీక్షలు రాస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

బనగానపల్లె, ఫిబ్రవరి 2 ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం నెహ్రూ ఉన్నతపాఠశాలలో పకడ్బందీగా నిర్వహించారు. ఆంధ్ర బెటాలియన్ జేసీవో జత్తార్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించారు. మొత్తం 109మంది ఎన్సీసీ క్యాడెట్స్ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను కర్నూల్ గ్రూప్ కమాండెంట్ కల్నల్ అలోక్ త్రిపాఠి తనిఖీ చేశారు. కమాండర్ మాట్లాడుతూ నేటి భారతావనికి నిజాయితీగల ఆరోగ్యవంతమైన యువత అవసరమన్నారు. కార్యక్రమంలో మెడికల్ మెడికల్ కంపెనీ చీఫ్ ఆఫీసర్ నాయక్ రాజీవ్‌కుమార్, నాయక్‌సెటీస్, నెహ్రూస్కూల్ కరస్పాండెంట్ కమల్‌తేజారెడ్డి, నాగరాజు, నాగస్వామి, మహేంద్ర, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతకు నగదు బహుమతి ఇస్తున్న ఎల్ల నాగయ్య

బేతంచెర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన అల్లాబకాష్ స్వామి ఉరుసు ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో ప్రథమ విజేతగా వెంకటగిరి ఎద్దులు నిలిచాయి. ఈ పోటీల్లో 18 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. ప్రథమ విజేతకు రూ.30వేలు, రెండో విజేతగా కడప జిల్లా చెన్నూరు చెందిన తుమ్మల సాయికుమార్ రెడ్డి ఎద్దులు రూ.20వేలు, మూడో విజేతగా వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్ శ్రేయ ఎద్దులు రూ.10వేలు, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఎద్దులకు నాల్గవ బహుమతి కింద రూ.6వేలు, బేతంచెర్లకు చెందిన మేకల వెంకట్రాముడు ఎద్దులకు రూ.3వేలు, వెల్దుర్తి మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన రవి ఎద్దులు 6వ బహుమతి రూ.3వేలు విజేతలుగా నిలిచాయి. విజేతలకు గ్రామ పెద్దలు, దాతలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, ఎద్దుల యజమానులు, రైతులు పాల్గొన్నారు. అలాగే జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమ విజేత శకునాల జట్టు నిలిచింది. ఈ పోటీల్లో 35 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఓర్వకల్లు మండలం శకునాల గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు విజేతగా నిలిచి రూ.30వేలు నగదును, రాయలసీమ యూనివర్సిటీ కబడ్డీ జట్టు రెండో విజేతగా నిలిచి రూ.20వేలు నగదును, తాడిపత్రికి చెందిన కబడ్డీ జట్టు మూడో విజేతగా నిలిచి రూ.10వేలు, బేతంచెర్ల మండలం ఎంబాయి కబడ్డీ జట్టు నాలుగో విజేతగా నిలిచి రూ.5వేలు నగదును కైవసం చేసుకున్నాయి. విజేతలకు గ్రామ పెద్దలు, నిర్వాహకులు యూత్ కమిటీ సభ్యులు బహుమతులను ప్రధానం చేశారు.

కొలనుభారతి క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు



కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివె ళ్ల), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో ఆత్మకూరు పరిధిలో వెలసిన కొలనుభారతి క్షేత్రం ఎంతో మహిమాన్వి తమైనదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖి లప్రియ అన్నారు. ఆదివారం సరస్వతీ ఆలయా న్ని ఎమ్మెల్యే సందర్శించారు. వసంత పంచమి సందర్భంగా తన కుమారుడు భూమా వీర వెంకట నాగిరెడ్డికి ఎమ్మెల్యే అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారికి ఎమ్మెల్యే కుటుంబసభ్యులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మా ట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రిగా పని చేసిన సమయంలో కొలను భారతి, సంగమేశ్వరం క్షేత్రాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు.

'దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం'

డోన్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే ఉద్యమిస్తామని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని రకాల పరీక్షలు చేసి సదరం సర్టిఫికెట్లు కేటాయించి వారికి పింఛన్లు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు

- ఎంపీఈఈ రఘురాముడు



రుద్రవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చెరువుల అభివృద్ధికి రూ.20 కోట్లతో 97 పనులు చేసేందుకు నివేదికలు రూపొందించి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీఈఈ రఘు రాముడు తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే ఆ చుట్టుపక్కల భూగర్భజలం కూడా పెరిగి అవకాశం ఉందన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని చెరువులున్నాయి?

జవాబు : 16 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 2600 ఎకరాలు ఆయకట్టు ఉంది. పంచాయతీరాజ్ కింద 17 చెరువులున్నాయి. 700 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రశ్న : చెరువుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : చెరువుల అభివృద్ధికి రూ.20కోట్లు అవసరముందని ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడుతాం.

ప్రశ్న : ఏఏ పనులు చేపట్టనున్నారు?

జవాబు : చెరువు గట్లు బలోపేతం, అలుగులు, తూములు మరమ్మతులు చేయించనున్నాం. ఇంకా చిన్న చిన్న మరమ్మతులు చేపడుతాం.

ప్రశ్న : చెరువుల కబ్జాపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : చెరువుల కబ్జాపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు గ్రామాల్లో కబ్జాకు గురైన చెరువులను గుర్తించి తహసీల్దారుకు నివేదిక పంపించాం. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం. ప్రతి చెరువు సర్వే చేయించి సరిహద్దులను గుర్తిస్తాం.

ధ్వంసం చేయడం దుర్మార్గం



సీఎస్ఐ చర్చి వద్ద నిరసన తెలుపుతున్న ఫాదర్, క్రైస్తవులు

చాగలమర్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు సంబంధించిన సమాధులపై ఏర్పాటు చేసిన శిలువలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడం దుర్మార్గమని చాగలమర్రి సీఎస్ఐ చర్చి ఫాదర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం చాగలమర్రి సీఎస్ఐ చర్చి వద్ద సంఘ పెద్దలు విజయరాజు, యోహాన్, జానీ, చైపాల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు వినతి పత్రం అందజేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్‌లు క్రైస్తవుల సమాధులపై ధ్వంసమైన శిలువలను పరిశీలించి విచారణ చేపట్టారు.

పేదలకు ప్రయోజం లేని బడ్జెట్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలుయాదవ్

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులను అందలమెక్కించే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని కాంగ్రెస్ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి బాలుయాదవ్ అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌గా ఉందన్నారు. రైతుకు ప్రయోజనం చేకూరే మద్దతు ధరలు, రుణమాఫీ ప్రస్తావన లేదన్నారు. పంటల బీమాకు నిధుల కేటాయింపు లేకపోవడం రైతులకు నిరాశపరిచిందన్నారు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గించడంలేదన్నారు. పంటరుణాలు కిసాన్ క్రెడిట్‌కార్డు ద్వారా రూ.3లక్షల నుంచి ఐదులక్షలు పెంచుతామని చెప్పిన రైతులకు ప్రయోజనం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం'

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి మిగిలిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలను పక్కన బెట్టిందన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యను నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా తెలిపారు. మండలంలో 199 చేతి పంపు బోర్లు ఉండగా, 110 చేతి పంపులకు మరమ్మతులు చేయించామన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటున్నట్లు ఏఈ తెలిపారు.

ప్రవర్తన మార్చుకోవాలి: సీఐ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్థులు తమ నేర ప్రవర్తన విడనాడి, సత్ప్రవర్తనతో జీవించాలని కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో జీవిస్తే, మున్ముందు రౌడీషీట్ తొలగించే అవకాశం ఉంటుందని అన్నారు. ఏఎస్ఐ గోవిందనాయక్, నరసిం హులు, రాజ్‌భాస్కర్ పాల్గొన్నారు.

పింఛన్ కోసం ఎదురు చూపులు

చాగలమర్రి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. తండా గ్రామానికి చెందిన 82 సంవత్సరాల లక్ష్మీరాముడు నాయక్ అనే వృద్ధుడు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నాడు. 2014-19 వరకు పింఛన్ ఇచ్చారు. 2020లో పింఛన్‌ను తొలగించారు. కస్తూర్బా పాఠశాలలో తన భార్య వీరమ్మబాయి వంట మనిషిగా పని చేసేది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగం పేరుతో తనకు వస్తున్న పింఛన్‌ను వైసీపీ ప్రభుత్వంలో తొలగించారని లక్ష్మీరాముడు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ రాకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వమైన ఆదుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేంద్ర

డోన్ టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయం జిల్లా అధ్యక్షుడుగా డోన్ పట్టణానికి చెందిన సాధనగిరి సురేంద్ర (అమెనీటిస్ సెక్రటరీ)గా నియమితులయ్యారు. ఆదివారం సురేంద్ర విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభు త్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రకటించిన ట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు త్రేతా మహిళా సంరక్షణ కార్యదర్శి హెచ్.భారతి, జిల్లా ట్రెజరరీగా నవీన్, సహాయ కార్యదర్శిగా బి.శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు యు.రాజశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు.